# లక్ష్యాలు సాధిస్తాం..

- సరి'కొత్త' ఆలోచనలతో ముందుకు సాగుతాం
- 'సాక్షి' డిబేట్‌లో విద్యార్థుల మనోగతం

**నారాయణపేట రూరల్:** కొత్త సంవత్సరంలో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. నూతన ఆలోచనలు, సరికొత్త లక్ష్యాలతో ముందుకు సాగుతామని స్థానిక శ్రీసాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాల విద్యార్థులు అన్నారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన డిబేట్‌లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త సంవత్సరంలో తీసుకోవాల్సిన నిర్ణయాలు, చేపట్టాల్సిన మార్పులపై విస్తృతమైన చర్చ జరిపారు. గతేడాది చేసిన పొరపాట్లను సవరించుకుంటామని.. చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా కొత్త సంవత్సరానికి నాంది పలుకుతామన్నారు. యాంత్రీకరణ జీవనంతో ఒత్తిడికి లోనుకాకుండా నిత్యం యోగా, వ్యాయామంతో మెరుగైన జీవితాన్ని నిర్మించుకుంటామని చెప్పారు.


జిల్లా కేంద్రంలోని శ్రీసాయి కళాశాలలో 'సాక్షి' డిబేట్‌కు హాజరైన విద్యార్థులు

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాద్గిరి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలుగు వారికి ఉగాది కొత్త సంవత్సరం అయినప్పటికీ.. యూనివర్సల్‌గా నిర్వహిస్తున్న జనవరి 1 ఆంగ్ల నూతన సంవత్సరాన్ని మనలోని చెడును దూరం చేసి.. మంచి వైపునకు అడుగులు వేసేందుకు వినియోగించుకోవాలని సూచించారు.

### పొరపాట్లకు తావివ్వకుండా..



నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ముందుకుసాగాలని కొనసాగించాలని నిర్ణయించుకున్నా. గతేడాది చేసిన పొరపాట్లను పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలతో ముందుకెళ్తాం.
– శివాని, ఊట్కూర్

### సమయం వృథా చేయరాదు..



చాలా మంది మొబైల్ ఫోన్‌కు అంకితమై సమయం వృథా చేస్తుంటారు. కొత్త సంవత్సరంలో మొబైల్ వాడకాన్ని తగ్గించి.. చదువు, లక్ష్యం దిశగా దృష్టి సారించాలి.
– సువర్ణ, కోటకొండ

### ఉన్నత లక్ష్యం నిర్దేశం..



జీవిత గమ్యంలో ఒక ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఇప్పటి వరకు నిర్లక్ష్యంగా ఉన్నప్పటికీ కొత్త సంవత్సరంలో చక్కటి ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణపై దృష్టిపెట్టాలి.
– రక్షిత, ధన్వాడ

### ఆరోగ్యం చూసుకోవాలి..



ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరికి ఎప్పుడు ఏ రోగం వస్తుందో తెలియదు. చదువు ఎంత ముఖ్యమో, ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. గతంలో చేసిన నిర్లక్ష్యాన్ని విడనాడి కొత్త సంవత్సరంలో పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.
– మమత, కాన్‌కుర్తి

### ఒత్తిడిని అధిగమించాలి..



ఉరుకుల పరుగుల జీవితంలో కొందరు ప్రతి చిన్న విషయానికి ఒత్తిడికి లోనవుతున్నారు. రోజు యోగా చేస్తూ.. వ్యాయామం అలవాటు చేసుకుంటే చాలా వరకు ఒత్తిడిని అధిగమించవచ్చు. కొత్త ఏడాదిలో వయసుతో సంబంధం లేకుండా అందరూ యోగా, వ్యాయామాన్ని దినచర్యగా మార్చుకోవాలి. – భవ్య, కోటకొండ

### మత్తుకు దూరంగా ఉండాలి..



చాలా మంది యువత మద్యం, డ్రగ్స్‌కు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అలాంటి చెడు అలవాట్లను విడిచిపెట్టాలి. కొత్త సంవత్సరంలో వాటికి దూరంగా ఉండేందుకు ప్రయత్నం చేయాలి. మళ్లీ మంచి అలవాట్లను అలవర్చుకోవాలి.
– సిద్ధార్థ, భైరంకొండ

### అందరితో కలసిమెలసి..



కళాశాలలో చాలా మంది స్నేహితులు కఠినంగా వ్యవహరిస్తారు. దీంతో అందరికీ ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి వారు కొత్త సంవత్సరంలో వారి ప్రవర్తనను మార్చుకుని అందరితో కలసిమెలిసి సరదాగా ఉండాలి. – రాజ్‌కుమార్ నాయక్, దామరగిద్ద తండా

### ఉగాదికే జరుపుకోవాలి..



కొత్త ఏడాది సంబరాలను ఉగాదినాడే జరుపుకోవాలి. ఆంగ్ల కాలమానాన్ని క్యాలెండర్‌కే పరిమితం చేయాలి. కొత్త సంవత్సరం పేరుతో సమయం, డబ్బులు వృథా చేసుకోరాదు.
– బసుదే నవీన్‌కుమార్, నారాయణపేట

### చదువుపై దృష్టి..



ఏడాది వరకు పాఠశాలలో చదువుపై పెద్దగా ఫోకస్ చేయలేదు. జరిగిన నష్టంపై నా స్నేహితులంతా బాధపడుతున్నారు. కొత్త ఏడాదిలో చదువుపై దృష్టి పెట్టి కళాశాలలో మంచి మార్కులు సాధించేందుకు ప్రయత్నం చేస్తాం.
– అరుణ్ కుమార్, వల్లంపల్లి

### క్రీడలకు ప్రాధాన్యత..



వయసుకు సంబంధం లేకుండా అందరూ క్రీడల్లో పాల్గొనాలి. యాంత్రిక జీవనంలో చాలామంది క్రీడలకు దూరంగా ఉంటున్నారు. గతేడాది క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాం. కొత్త సంవత్సరంలో ఆటలకు ప్రాధాన్యత ఇచ్చి సమయం కేటాయిస్తాం. – అజయ్, కొల్లంపల్లి

## న్యూస్‌రీల్

### పోలీస్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు



**నారాయణపేట:** జిల్లా కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు చేసినట్లు అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్ తెలిపారు. గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి, అక్రమ రవాణా జరగకుండా జిల్లా కేంద్రంలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా పార్సెల్ సర్వీసెస్‌లో, కొరియర్ సెంటర్లు, పాన్‌షాప్‌లలో, బస్టాండ్‌లో, బార్స్, లాడ్జిలలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ప్రజలు, ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆంజనేయులు, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

### నూతన సంవత్సర శుభాకాంక్షలు



**మక్తల్:** నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### విద్యుత్ మోటార్ల చోరీ..

**కృష్ణా:** మండలంలోని ఆయా గ్రామాల్లో వారం రోజులుగా వరుసగా రైతులకు చెందిన విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. మంగళవారం గుర్జాల్‌లో రైతుపొలంలో ఉన్న విద్యుత్‌మోటర్ అపహరణకు గురైందన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

### నేడు అయ్యప్పస్వామి పడిపూజ

**మక్తల్:** పట్టణంలో బుధవారం అయ్యప్ప స్వామి ఆలయంలో ఉదయం 11 గంటలకు అయ్యప్పస్వామి పడి పూజ ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ చంద్రకాంత్‌గౌడ్, గురుస్వామి అశోక్‌గౌడ్ తెలిపారు. ఈ పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని అన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### మూఢ నమ్మకాలు నమ్మొద్దు



**మరికల్:** గ్రామాల్లో ప్రజలు మూఢ నమ్మకాలను వదిలిపెట్టాలని తహసీల్దార్ జమీల్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దచింతకుంటలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ మేరకు.. తహసీల్దార్ మాట్లాడుతూ.. రెండు గ్లాసుల పద్ధతి నిర్మూలించి, ఆలయాల ప్రవేశం చేయాలని సూచించారు. అలాగే మూఢ నమ్మకాలను పక్కన పెట్టి కలిసిమెలసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ఏఎస్ఐ మసుద్, మురళి పాల్గొన్నారు.

### పింఛన్లు పెంచాలని ఆందోళన

**మరికల్:** వృద్ధులకు సంబంధించిన పింఛన్లు పెంచి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని మంగళవారం వృద్ధులు, దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి అర్హులందరికీ పింఛన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు.

### సమస్యల పరిష్కారానికి ప్రెస్ క్లబ్ ఉపయోగపడాలి

**మద్దూరు:** మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రెస్ క్లబ్ ఉపయోగపడాలని తహసీల్దార్ మహేష్‌గౌడ్, ఎస్ఐ రాంలాల్, ఎంపీడీఓ నర్సింహారెడ్డి, వివిధ పార్టీల నాయకులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో మండల టీయూడబ్ల్యూజే ప్రెస్ క్లబ్‌ను అధికారులు, వివిధ పార్టీల నాయకులు ప్రారంభించారు. సలీం, నర్సింహ, మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే


పాథర్చేడ్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

**నర్వ:** మండలంలో ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని పాథర్చేడ్‌లో చేపట్టిన సర్వేను ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించి తగిన సూచనలు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 9326దరఖాస్తులకుగాను 6వేలకు పైగా ఇళ్ల సర్వేను చేపట్టామన్నారు. లబ్ధిదారులు సర్వేలో అధికారులకు సహకరించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

**మాగనూర్:** మండలంలోని గురువలింపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కొనసాగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ రహ్మతుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇంటింటికీ పంచాయతీ కార్యదర్శులు తిరిగి వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. చివరిరోజు వరకు 90శాతం సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### హామీలను నెరవేర్చాలి..

**కృష్ణా:** రెండు లక్షలపైన ఉన్న రైతుల రుణాలను మాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే రెండు లక్షలపైన ఉన్న రుణాలు మాఫీచేసి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మండల నాయకులు నర్సప్ప, రాఘవేంద్ర ఉన్నారు.

## కుల నిర్మూలనకు కృషిచేద్దాం


మాగనూర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు


ఊట్కూర్‌లో..

**ఊట్కూర్:** గ్రామాల్లో కుల నిర్మూలనకు ప్రతి ఒక్కరం కృషిచేద్దామని ఆర్ఐ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఓబ్లాపూర్‌లో రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అందరు కలిసిమెలసి ఉండాలని కోరారు. అంటరాని తనం, కుల వివక్షత పాటించరాదని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రాజనర్సయ్య గౌడ్, భీమకవి, వెంకటప్ప, రాజు, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

**మాగనూర్:** మండల పరిధిలోని గురువలింగంపల్లి పంచాయతీ కార్యాలయంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి నెల చివరి రోజున గ్రామాల్లో ప్రజలు, యువకులకు హక్కుల గురించి వివరించారు. సమాజంలో ఏలాంటి మూఢనమ్మకాలు లేకుండా కుల, మత వర్గ భేదాలు లేకుండా అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి భిన్నత్వంలో ఏకత్వంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ శ్రీశైలం, ఏఎస్ఐ మన్నన్, కానిస్టేబుల్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ విడుదల

**మద్దూరు:** సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈ నెల 3న హన్మకొండ జిల్లా పరకాల ఎంఎన్‌రావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే జ్ఞాన దినోత్సవం సభ పోస్టర్‌ను మంగళవారం మండలంలోని అతిథి గృహంలో బీఆర్ఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

### అలసందలు క్వింటాల్‌కు రూ.7,329

**నారాయణపేట:** స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం అలసందలు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,329, కనిష్ఠంగా రూ.7,239 పలికాయి. వడ్లు హంస గరిష్ఠ, కనిష్ఠంగా రూ.1,810, వడ్లు సోన గరిష్ఠంగా రూ. 2,503, కనిష్ఠంగా రూ.1,739, ఎర్ర కందులు, గరిష్ఠంగా రూ.8,889, కనిష్ఠంగా రూ. 7వేలు పలికాయి.

### బాధితులకు న్యాయం చేస్తాం..


మాట్లాడుతున్న ఆర్డీఓ

**మక్తల్:** అనుగొండ పునరావాస బాధితుల కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుని న్యాయం చేస్తామని ఆర్డీఓ రాంచందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని అనుగొండలో గ్రామ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఆర్ఆర్ సెంటర్ కోసం 232, 252, 253, 262, సర్వే నంబర్‌లో ఉన్న 80ఎకరాల 12గుంటల స్థలాన్ని కేటాయించారు. లేఅవుట్ అభ్యంతరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆర్ఆర్ సెంటర్‌లో చేయాల్సిన పనులపై గ్రామస్తులకు తెలియజేశారు. ఆర్ఐ రాము, ఈఈ ఉదయ్‌శంకర్, డిప్యూటీ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, డీఈ సతీష్‌కుమార్, ఏఈలు వెంకటేష్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనది

**దామరగిద్ద:** నవ్యసమాజాన్ని తీర్చిదిద్దే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవి విరమణ పొందిన హింది ఉపాధ్యాయుడు బల్వీర్ క్షీరసాగర్ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య తిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఘనంగా సన్మానించారు. జీహెచ్ఎం బాలాజీ, అశోక్, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.


మక్తల్‌లో కేక్ తీసుకెళ్తున్న గ్రామస్తులు

### కొత్త సందడి ..

**మక్తల్:** పట్టణంలోని దుకాణాలు, బేకరీలను నిర్వాహకులు సుందరంగా ముస్తాబుచేశారు. రంగు రంగులలో, ప్రత్యేక ఆకృతుల్లో కేకులను కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య కొత్త సంవత్సరవేడుకలు జరుపుకున్నారు. ప్రజలు ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసి కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.


మక్తల్‌లో కేక్ కొనుగోలు చేస్తున్న ప్రజలు


ధన్వాడలో..

## డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలి


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఐ శివశంకర్

**నారాయణపేట:** ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎంటీఓ ఆర్ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ స్టేషన్‌లో పెట్రోల్ కార్ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు నేరాలు జరగకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మెకానిజంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసు మోటార్ వాహన డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి కలిసి పనిచేద్దాం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ గోవిందరాజులు

**నారాయణపేట రూరల్:** జిల్లాలో విద్యారంగా అభివృద్ధికి కలిసి పని చేద్దామని డీఈఓ గోవిందరాజులు అన్నారు. పీఆర్టీయూ టీఎస్ నూతన క్యాలెండర్‌ను డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రాబోయే పది పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని, ప్రైవేటుకు దీటుగా ప్రతి ప్రభుత్వ పాఠశాల వందశాతం ఫలితాలు, 10 జీపీఏ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు యాద్గిర్ జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుపతి, ఏఎంఓ విద్యాసాగర్, ఎంఈఓలు బాలకృష్ణప్ప, సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, నాగార్జున రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ


మరికల్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

**మరికల్:** మండల కేంద్రంలోని పీస్ ఏంజెల్స్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఎంఈఓ మనోరంజిని నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మల్లేష్, తిరుపతయ్య, రఘు, జీవన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మద్దూరు:** మండల కేంద్రంలోని చౌడేశ్వరీ ఆలయంలో మంగళవారం తొగుటవీర క్షత్రియుల క్యాలెండర్‌ను అయ్యప్ప మాలధారులు ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తొగుట వీర క్షత్రియులకు వీటిని అందజేసినట్లు మండల అధ్యక్షుడు విఠల్ తెలియజేశారు. అయ్యప్ప స్వాములు అంజయ్య, విష్ణు, సతీష్, ప్రకాష్, రామకృష్ణ, మహాదేవ్, భాస్కర్, కృష్ణ, శేఖర్, పాల్గొన్నారు.

**మక్తల్:** పట్టణంలో ఏసీ కన్వెన్షన్‌హాల్‌లో మంగళవారం వెంకటేశ్వర పంక్షన్‌హాల్ యజమాని రతన్ కుమార్‌గుప్తా తన సొంత ఖర్చులతో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి పలువురికి ఉచితంగా అందజేశారు. శివన్న, మల్లికార్జున్, మహేష్, సత్యం, రఘు, ఆదిత్య, కృష్ణ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఇంటిపండుగ



**కొత్తపల్లి:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూనీడులో మంగళవారం విద్యార్థులు ఇంటి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు తమ ఇంటి వద్ద తయారుచేసిన ఆహార పదార్థాలను తీసుకొని పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాల్‌లలో ప్రదర్శించారు. ఆహార పదార్థాలకు కావాల్సిన వస్తువులు ఏలా ఉపయోగపడుతాయో దాని వల్ల కలిగే లాభాలను వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు చాలా అవసరమని హెచ్ఎం డాక్టర్ చెన్న కేశవరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.